

● ఉట్నూర్ పాఠశాలలో తలుపులు లేని మరుగుదొడ్లు స్నానాల గదులు

సమస్యలకు నిలయాలు.. ఆశ్రమ పాఠశాలలు

- జిల్లాలో కనీస సౌకర్యాలకు నోచుకోని పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు
- విరిగిన కిటికీలు, తలుపులతో ఇక్కట్లు
- పలుచోట్ల పని చేయని ఆర్వో ప్లాంట్లు
- అలంకారప్రాయంగా మారిన సోలార్ ప్యానెల్స్
- విద్యార్థులకు తప్పని తిప్పలు

ఉట్నూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న వారికి కనీస సౌకర్యాలు కల్పించడానికి లక్షల రూపాయలు ఖర్చు చేసినా.. పథకాలన్నీ ఎండమావులుగా మారుతున్నాయి. గత దశాబ్దాలుగా ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న ఆశ్రమ పాఠశాలల సమస్యలు పరిష్కరించడానికి ప్రతియేటా ప్రభుత్వం లక్షల రూపాయలు వ్యయం చేస్తోంది. అయినా సమస్యలు రాజ్యమేలుతుండడంతో ఎక్కడ పొరపాటు జరుగుతుందో ఉన్నతాధికారులు గ్రహించాలని పరిశీలకులు అంటున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

ఆశ్రమ పాఠశాలల మరమ్మతుల పనులను చేపట్టాల్సిన గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వసతి గృహాల్లో విరిగి తలుపులు, కిటికీల పునరుద్ధరణ పనులు చేపట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలతో పాటు మండలంలోని లక్కేటిపేట, ఏందా, నర్సాపూర్ బి, హస్నాపూర్, జండా, తడిహత్నూర్, నార్నూర్, గాదిగూడతో పాటు తదితర పాఠశాలల్లో వివిధ మరమ్మతులు ఏర్పడుతున్న సకాలంలో పని చేయకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని విద్యార్థులు, తల్లిదండ్రులు అంటున్నారు. ఇటీవల ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ సైతం లక్కేటిపేట్ ఆశ్రమ పాఠశాల సందర్శించి పాఠశాల స్థితిగతులను పరిశీలించారు.

బోరుబావుల నీరే దిక్కాయే!!

కలుషిత నీటి బారిన పడకుండా విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందించాలని ఒక్కో పాఠశాలకు వేలాది రూపాయలు కేటాయించి ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు పని చేయకపోవడంతో ఉన్నతాధికారుల ఆశయం నీరుగారి పోతోంది. ఫలితంగా విద్యార్థులు బోరుబావుల నీరు తాగి కాలం గడిపేస్తున్నారు. గాదిగూడ బాలికల ఆశ్రమ పాఠశాల, మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాల, గుడిహత్నూర్ మండలంలోని ఉమ్రి, ఆదిలాబాద్ మండలం చించుఘాట్ బాలికల పాఠశాల, వాన్వాట్, భీంపూర్ మండలంలోని అందర్‌బంద్, తలమడుగు మండలంలోని ఝరిపూనగూడ, తాంసి మండలకేంద్రంలోని ఆశ్రమ పాఠశాల, బేల మండలంలోని సైదుపూర్, బజార్‌హత్నూర్ మండలం జాతర్ల, ఆదిలాబాద్ మండలం పొతగూడ స్కూల్ కాంప్లెక్స్, గాదిగూడ మండలం అర్జుని, గాదిగూడ ఆశ్రమ పాఠశాల, చితగడూ, ఇంద్రవెల్లి మండలం పిట్టబొంగరం, నార్నూర్ మండలం జాముడా, నార్నూర్ ఆశ్రమ పాఠశాల, నార్నూర్ మండలంలోని భీంపూర్, ఉట్నూర్‌లోని

(తరువాయి 6వ పేజీలో...)





● లక్కేటిపేట ఆశ్రమ పాఠశాలలో విరిగిన సీలింగ్ ఫ్యాన్, కిటికీల తలుపులు విరిగిన దృశ్యం





● ఉట్నూర్ బాలుర ఆశ్రమ పాఠశాలలో పని చేయని ఆర్వో ప్లాంటు

ఫ్యాన్లు నడవడం లేదు

: సాయి, 9వ తరగతి, ఉట్నూర్



ఉట్నూర్ మండలంలోని లక్కేటిపేట గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఫ్యాన్లు నడవక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. వేసవి కాలం వచ్చేలోపు మరమ్మతులు చేయించాలి.

కొత్త బ్లాంకెట్లు సరఫరా కావాలి

: సచిన్, పదవ తరగతి



ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు చలికాలం ప్రారంభమైనందున బ్లాంకెట్లు సరఫరా చేయాలి. ప్రస్తుతం చలి తీవ్రత పెరుగుతున్నందున పాత బ్లాంకెట్లను వినియోగిస్తున్నాం.

ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారిస్తాం

: జాదవ్ వసంత్‌రావు, ఇన్‌చార్జి డీడీ, ఉట్నూర్



గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి దృష్టికితీసుకువెళ్లి సత్వరం పరిష్కరించడానికి ప్రయత్నిస్తాం. లక్కేటిపేటలో కరెంట్ సౌకర్యం కల్పించాం. మరమ్మత్తుల పనులను ఇంజనీరింగ్ శాఖ అధికారుల ద్వారా చేయిస్తాం.

ఆదిలాబాద్‌లో ఘనంగా ఆరట్టు

- అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహంతో ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర
- పెన్‌గంగాలో చక్రతీర్థ స్నానం
- పాల్గొన్న అయ్యప్ప స్వాములు

6



చిరుతపులి దాడిలో ఆవు మృతి

- బుర్కపల్లి అటవీ ప్రాంత శివారులో చిరుతల అడుగుల జాడ గుర్తింపు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న అటవీ శాఖ అధికారులు

6



మళ్లీ తెరపైకి 'ఆదర్శ రైతు'

- ఇటీవల వ్యవస్థను పునరుద్ధరిస్తాం అన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- ఏఈవోలకు కలగనున్న ఊరట
- వెయ్యి ఎకరాలకు ఒకరు

7



ప్రజా పోరాట ఉద్యమకారులను ప్రజలు గౌరవిస్తారు : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన పోరాటాలు, ఉద్యమాలు చేసే ఉద్యమకారులను ప్రజలు చిరకాలం గుర్తించుకుంటారని, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. ఆదివాసీ హక్కుల కోసం నిరంతరం ఉద్యమాలు చేసిన ఉద్యమకారుడు ఉయిక సంజీవ్ సంస్మరణ సభ ఆదవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్సీ సమావేశం మందిరంలో తుడందెబ్బ, ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదివాసీ హక్కుల కోసం నిస్వార్థంగా ఎందరో ఆదివాసీ అమరులు కృషి చేశారని, అందరిని తలచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జాతి ఉద్యమకారులకు, బాధిత కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు. సంజీవ్ కుటుంబాన్ని ఆదుకుంటామని, ఆయన కూతురు చదువుకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య, రాష్ట్ర కార్యదర్శి గోడం గణేష్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు దాదేరావు, పంద్రం జయవంతరావు, పుష్పరాణి, ఆత్రం సుగుణ, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు పోలీసు కిష్టయ్య'

సిరికొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమ పోరాట తొలి అమరుడు దివంగత పోలీసు కిష్టయ్య ముదిరాజ్ జయంతి, వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిరికొండ ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు ఓరగంటి పెంటన్న ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం పోలీసు కిష్టయ్య ముదిరాజ్ 15వ వర్ధంతిని పురస్కరించుకుని సిరికొండలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 1న పోలీసు కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ముదిరాజ్ ముద్దుబిడ్డ కిష్టయ్య ముదిరాజ్ సెల్ టవర్ ఎక్కి తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మ బలిదానానికి పాల్పడ్డాడని గుర్తు చేశారు. పోలీసుల్లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన వారికి ఆయన పేరిట అవార్డుల ప్రధానం జరగాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇందులో సంఘం మండల అధ్యక్షుడు ఓరుగంటి విజయ్‌కుమార్, సభ్యులు ఎగ్గిడి మల్లన్న, ఓరగంటి నర్సింలు, శాగంటి ఆశన్న, ఎగ్గిడి ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

నేటి నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు

● 2కే రన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయడంలో భాగంగా ప్రజాపాలన విజయోత్సవాలను డిసెంబరు 1నుంచి 9వ తేదీ వరకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి 2కే రన్‌ను చేపట్టారు. దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి రన్‌లో పాల్గొన్నారు. ముందుగా ఆయా క్రీడల్లో రాణించిన క్రీడాకారులను కలెక్టర్ సన్మానించారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ప్రజాపాలనపై రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఈ నెల 9 వరకు జిల్లావ్యాప్తంగా ప్రజాపాలన విజయోత్సవ సంబరాలను రోజుకో ఓ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. శాఖల ద్వారా జరిగిన అభివృద్ధిని తెలియజేస్తారన్నారు. అదేవిధంగా ఈ నెల 9వ తేదీ వరకు సాంస్కృతిక కళాకారులు 114 జీపీల్లో ప్రజాపాలనపై పాటల ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమాలు పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రజాపాలనపై ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్‌రాథోడ్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఐఈవో రవీందర్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఎంవో శ్రీధర్, గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి, తదితరులున్నారు.



జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో భోజన పట్టికను పరిశీలిస్తూ..



పాటల సీడీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

● ప్రజాపాలన ఆడియో సాంగ్ ఆవిష్కరణ

ఆదిలాబాద్ రూరల్(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాలు సందర్భంగా జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పాటను రూపొం దించారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్యేక పాటను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లాలోని ప్రతి గ్రామంలో కళా బృందాల చేత సంక్షేమ పథకాలను వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌వో తిరుమల పాల్గొన్నారు.



2కే రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

● బాలికల వసతి గృహం తనిఖీ

ఆదిలాబాద్ రూరల్(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. పరిసరాలు, వంటశాల, స్టోర్ రూమ్, సిక్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని, పరిసరాలు, వంటగది, వంట పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

నేరడిగొండ, డిసెంబర్1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాగ్ధారి నుంచి సావర్గావ్ గ్రామం వరకు నూతన గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో గ్రామస్థులు మాట్లాడుతూ గతంలో ఎంతో మంది ప్రజాప్రతినిధులకు సమస్యను విన్నవించినా పట్టించుకోలేదని, కనీసం తమని గ్రామస్థులుగా కూడా గుర్తించ లేదని వాపోయారు. కానీ మా 20ఏళ్ల కలను సాకారం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు రుణపడి ఉంటామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది అని అన్నారు. ఇందులో మాజీ ఎంపీపీ రాథోడ్‌సజన్, తిరుమలగౌడ్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివారెడ్డి, బాబులాల్, మారుతి, గులాబ్, రామరావు, గణేష్, చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

● సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నేరడిగొండ(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మికి మంజూరైన రూ.10వేల ఇచ్చోడ మండలంలోని జల్దా గ్రామానికి చెందిన ఎం.అరుణకి మంజూరైన 31.500 ఇచ్చోడ మండలంలోని ముఖ్రా గ్రామానికి చెందిన మన్సూర్‌ఆలీకి మంజూరు అయిన రూ.12వేలు, ముఖ్రబి గ్రామానికి చెందిన పద్మిని బాయికి రూ.19500, అలాగే తాంసి మండలం కప్పర్ల గ్రామానికి చెం దిన శ్రీనివాస్‌కు రూ.22500 అశోక్‌కు రూ.21వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పంపిణీ చేశారు.

● కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నేరడిగొండ(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని నిగిని గ్రామ పంచాయతీలో గల శిఖర్ కైలాష్‌టెక్డి నర్మదేశ్వర మందిర్ 22వ వార్షికోత్సవ సందర్భంగా ఈనెల 5నుంచి 9వరకు జరిగే శోభయాత్ర, గణపతిపూజ, గోపూజ, యాగశాల వ్యవస్థీకరణ కరపత్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నేరడిగొండలోని తన నివాసంలో లింబాజి మహారాజ్‌తో కలిసి ఆవిష్కరించారు.

తాంసి(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ తన నివాసంలో చెక్కులను పంపిణీ చేశారు. కప్పర్ల, గోత్నూరి, సవర్గావ్ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందించిన సాయాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహేందర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

● క్రికెట్ టోర్నీ కరపత్రాల విడుదల

బజార్‌హత్నూర్(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంటును నిర్వహిస్తున్నామని మండల యువజన అధ్యక్షుడు డుబ్బుల చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేతుల మీదుగ టోర్నీ కరపత్రాలను విడుదల చేశారు. మొదటి బహుమతి రూ.25వేలు, రెండవ బహుమతి రూ.15వేలు, మూడవ బహుమతిగ రూ.5వేలు అని, ఎంట్రీ ఫీజు రూ.వెయ్యి అని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకోవాలన్నారు.

ప్రజాపాలన ఇంటింటికీ చేరేలా

హైదరాబాద్‌లో విజయోత్సవం

- జీహెచ్‌ఎంసీలోని ముఖ్య నేతలకు పొన్నం దిశానిర్దేశం
- జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికీ తెలిసేలా ప్రజాపాలన విజయోత్సవాన్ని నిర్వహించాలని జీహెచ్ఎంసీ పరిధిలోని నేతలకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ముఖ్యనేతలతో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆదివారం పొన్నం సమావేశమయ్యారు. ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్, ఎమ్మెల్సీలు అమీర్‌అలీ ఖాన్, ఎంఎస్ ప్రభాకర్, 23 మంది కార్పొరేటర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. విజయోత్సవాల్లో భాగంగా 7వ తేదీన డివిజన్ స్థాయిలో మహిళలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులతో నేతలు సమావేశం కావాలన్నారు. 8న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ట్యాంక్‌బండ్‌పై జరిగే ర్యాలీకి పెద్ద ఎత్తున జనసమీకరణ చేపట్టాలని సూచించారు. దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో విజయం కోసం పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ విజయాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించాలని చెప్పారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటాలంటే కార్పొరేటర్లంతా శ్రమించాలని దిశానిర్దేశం చేశారు.

ఎవరినీ బలవంతంగా తరలించం: సీతక్క

దోమలపెంట, శ్రీశైలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతుగా సహకరిస్తానని మంత్రి సీతక్క తెలిపారు. పునరావాసం ఇష్టం లేనివారు అటవీ ప్రాంతంలోనే ఉండొచ్చని, వారికీ అన్ని విధాలా సహకరిస్తామని, ఎవరినీ బలవంతంగా తరలించేది లేదని స్పష్టం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని నల్లమల అటవీ ప్రాంత గ్రామాలైన వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబావి గ్రామాల్లో ఆమె పర్యటించారు. సీబీఎం ట్రస్టు చైర్మన్, అమ్రాబాద్ మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ ఆధ్వర్యంలో 400 మంది చెంచులకు దుప్పట్లు పంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీశాఖ చేపట్టనున్న పునరావాస గ్రామాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇక్కడి నుంచి స్వచ్ఛందంగా మైదాన ప్రాంతాలకు వెళ్లేవారికి సహకరించాలని అధికారులకు సూచించారు. కాగా, శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను మంత్రి సీతక్క దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రికి పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

బీఆర్ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదు: జూపల్లి

- పాలమూరు ప్రజలకు కేసీఆర్ మోసం: యెన్నం

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండగ సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంత్రి మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాలమూరు జిల్లా రైతన్నల సాగు నీటి కష్టాలను బీఆర్ఎస్ ప్రభుత్వం తీర్చలేక పోయిందని, జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను సీఎం కేటాయిస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు పండగ సభకు లక్షలాదిగా రైతులు తరలివచ్చి.. సీఎం రేవంత్‌ను ఆశీర్వదించారన్నారు. పాలమూరు ప్రజలను మాజీ కేసీఆర్ మోసం చేశాడని ఆరోపించారు.

లగచర్ల పారిశ్రామిక పార్కుపై సర్కారు దూకుడు!

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల్లో 182.31 ఎకరాలు సేకరించనున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంట్లో లగచర్లలో 110.32 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాలున్నాయి. 2 నోటిఫికేషన్ల ద్వారా లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి పరిధిలో మొత్తం 826.25 ఎకరాలు సేకరించనున్నారు. ఇంతకుముందు ఫార్మా విలేజ్‌లను ప్రతిపాదించిన లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోనే ఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు తీవ్ర వివాదాస్పదమైన నేపథ్యంలో.. వాటిని ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. వాటి స్థానంలో, పారిశ్రామిక పార్కు నిర్మాణం ప్రతిపాదనను తాజాగా ముందుకు తెచ్చింది. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు సేకరించనున్న భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు, రైతుల పేర్లు, భూ విస్తీర్ణం తదితర వివరాలను నోటిఫికేషన్లలో పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించిన అధికారిక ప్లాన్‌ను రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చూడవచ్చని తెలిపారు. నోటిఫికేషన్‌లో ఉన్న సర్వే నంబర్లలో ఏ భూమిలోకైనా ప్రవేశించి.. భూమిని సర్వే చేసి లెవెల్స్ తీసుకునేందుకు, బోరు వేయడం వంటి పనులు చేపట్టేందుకు తాండూరు సబ్ కలెక్టర్‌కు ప్రభుత్వం అధికారం కట్టబెట్టింది. నోటిఫికేషన్ జారీచేసిన నాటి నుంచి ఆ భూములపై ఎలాంటి లావాదేవీలకు అవకాశం లేదని.. అమ్మకాలు, కొనుగోళ్లు చేయరాదని, బ్యాంకుల్లో అప్పులు తీసుకోరాదని స్పష్టం చేశారు. భూసేకరణ, నష్టపరిహారం విషయంలో అభ్యంతరాలు ఉంటే.. నోటిఫికేషన్ విడుదలైన 60 రోజుల్లోగా రైతులు కలెక్టర్ దృష్టికి తేవాలని పేర్కొన్నారు.

25 వేల మందికి ఉద్యోగావకాశాలు

మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయటం ద్వారా దుద్యాల మండలంలోని లగచర్ల, పోలేపల్లి, హకీంపేట తదితర గ్రామాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టెక్స్‌టైల్ వంటి పరిశ్రమలు ఏర్పాటుచేసి కనీసం 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం భావిస్తున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. కొడంగల్ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటును ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై ప్రభుత్వం దూకుడుగానే వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. కాగా, మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యతను ప్రభుత్వం.. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(టీజీఐఐసీ)కు అప్పగించింది. భూసేకరణ ప్రక్రియ అనంతరం భూముల్లో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు చేపడతారు. భూములు కోల్పోనున్న వారికి నష్ట పరిహారంతోపాటు ఉపాధి, పునరావాసం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. సాధారణంగా భూసేకరణలో నిర్వాసితులకు నష్టపరిహారం, 125 గజాల నివాస స్థలం, కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం వంటివి ఇస్తుంటారు. దుద్యాల మండలంలో నిర్మించనున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌లో భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం ఏ విధమైన పరిహారం, పునరావాసం కల్పించనుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

నేడు కోర్టుల ముందుకు పిటిషన్లు

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో వివిధ పక్షాలు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం కోర్టుల ముందుకు రానున్నాయి. ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు కొడంగల్ జేఎఫ్ఎంసీలో వేసిన పిటిషన్‌పై నిర్ణయం వెలువడే అవకాశముంది. ఆయన బెయిల్ పిటిషన్ వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు ముందు విచారణకు రానుంది. రైతులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు వేసిన పిటిషన్లు కూడా జిల్లా కోర్టు ముందుకు రానున్నాయి.

విద్యలో నైపుణ్యాలకు పెద్దపీట!

ప్రపంచ అవసరాలకు పనికొచ్చేలా విద్యార్థులకు సాంకేతిక విద్య

- స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలు.. నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణలు
- పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా టీచర్ల సమస్యలను పరిష్కరించాం
- 11,062 టీచర్ పోస్టుల భర్తీ చేశాం..
- సీఎంఆర్ఎఫ్ సాయం రూ.830 కోట్లు.. ఒక్క ఏడాదిలోనే... ఇదో రికార్డు
- ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యా బోధనకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. విద్యారంగంలో గత ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విప్లవాత్మకమైన చర్యలను చేపట్టినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రపంచ అవసరాలను తీర్చే నైపుణ్యాలను విద్యార్థులు ఒడిసిపట్టేలా సాంకేతిక విద్యకు కొత్త మెరుగులు దిద్దుతోందని ప్రకటనలో పేర్కొంది. ఉపాధ్యాయులు పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా వారి సమస్యలను పరిష్కరించినట్లు ప్రకటించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.21,292 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, ఇది నిరుటి బడ్జెట్ కన్నా రూ.2,119 కోట్లు ఎక్కువ అని పేర్కొంది.. పాఠశాలల సమస్యలను పరిష్కరించడానికి అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలు తెరిచే నాటికి బల్లలు, కుర్చీలు, తలుపుల మరమ్మతులు.. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల విద్యుదీకరణ, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు జరిగిందని వెల్లడించింది. ఇందుకు రూ.1,100 కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తుచేశారు. ఏళ్ల తరబడి పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, బడుల్లో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు.. మొక్కల సంరక్షణకు సింగరేణి కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.136 కోట్లు కేటాయించినట్లు సీఎంవో వివరించింది. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని, సుమారు 21,419 మందికి పదోన్నతులు లభించాయని తెలిపింది. నిబంధనలకు అనుగుణంగా 37,406 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను, 2,757 మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలను చేసినట్టు వెల్లడించింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసినట్లు పేర్కొంది. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తున్నామని, అన్ని మండలాలకు మండల విద్యాధికారులను నియమించినట్లు వెల్లడించింది. పేద పిల్లలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టినట్టు తెలిపింది. ఆధునిక ప్రపంచ అవసరాలు, ప్రపంచంలోని పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ బిడ్డలకు నైపుణ్య విద్యను అందించాలనే సంకల్పంతో పురాతన కోర్సులు, సర్టిఫికెట్లకే పరిమితమైన 65 ఐటీఐలను రూ.2,106 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చినట్లు వెల్లడించింది. అకడమిక్ కోర్సులు.. పరిశ్రమల అవసరాల మధ్య అంతరాన్ని పూడ్చడానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించిట్లు వివరించింది. యువత ఆధునిక నైపుణ్యాలు నేర్చుకొని ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా ఈ స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలను తీర్చిదిద్దుతున్నట్టు చెప్పింది. పాఠశాలల్లోకి డ్రగ్స్ ప్రవేశించకుండా ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

సీఎంఆర్ఎఫ్ సాయం రూ.830 కోట్లు!

ముఖ్యమంత్రి సహాయనిధి అమలులో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డును నెలకొల్పింది. ఏడాదిలోనే సీఎంఆర్ఎఫ్ కింద దాదాపు రూ.830 కోట్లను విడుదల చేసింది. దీనిద్వారా దాదాపు 1,66,000 పేద, మధ్యతరగతి కుటుంబాలు లబ్ధి పొందాయి. గత ప్రభుత్వం ఐదేళ్లలో సీఎం సహాయనిధి కింద రూ.2400 కోట్ల సాయాన్నే అందించింది. మూగ, చెవుడు సమస్యలతో జన్మించే పిల్లలకు 6 ఏళ్లలోపు శస్త్రచికిత్సలు చేయిస్తే వారికి మాటలు రావడంతో పాటు చెవులు వినపడే అవకాశముంటుంది. ఈ విషయాన్ని తొలి సమీక్షలోనే వైద్యారోగ్య శాఖ.. సీఎం దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన సీఎం ఎంత ఖర్చయినా అలాంటి పిల్లలకు చికిత్సలు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు సుమారు 87 మంది పిల్లలకు ఎల్‌వోసీలను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో

రూ.8.14 కోట్ల మోసం

- బంజారాహిల్స్ బాధితుడి నుంచి కాజేసిన మోసగాళ్లు
- రాజస్థాన్‌లో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసంలో కీలకపాత్ర వహించిన ఇద్దరిని రాజస్థాన్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ట్రేడింగ్ పేరిట హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌కు చెందిన ఓ బాధితుడి నుంచి ఈ ముఠా రూ.8.14 కోట్లు కాజేసింది. అయితే ఈ ముఠా సూత్రధారి శ్రవణ్ కుమార్‌ను ఇటీవలే అరెస్టు చేశామని, అతనికి పలు బ్యాంకులకు సంబంధించిన కరెంట్ అకౌంట్ ఖాతాలు ఇచ్చి వాటిలోకి వచ్చిన డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించడంలో కీలకపాత్ర పోషించిన ఉదయ్‌పూర్‌కు చెందిన రాహుల్ డాంగీ, రాహుల్ బోయ్‌ను అరెస్టు చేసినట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. వీరిద్దరినీ ట్రాన్సిట్ వారంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్టు చెప్పారు. రాహుల్ డాంగీ.. శ్రీ సన్వారియా ఫర్నీచర్స్ పేరిట కరెంట్ అకౌంట్ ఖాతాను నిర్వహిస్తున్నాడని, ఇందులోకి ట్రేడింగ్ ద్వారా తాము టార్గెట్ చేసిన వ్యక్తుల నుంచి డబ్బు ట్రాన్స్‌ఫర్ చేస్తారని, బంజారాహిల్స్ బాధితుడికి సంబంధించిన రూ.75లక్షలు ఈ ఖాతాకు బదిలీ అయినట్టు శిఖా గోయల్ చెప్పారు. వెంటనే రాహుల్ ఆ డబ్బును 25 ఖాతాలకు మళ్లించినట్టు తెలిపారు. అలాగే రాహుల్ బోయ్ 5 ఖాతాలను నిందితులకు ఇచ్చాడని, వీటిలోని రెండు ఖాతాలకు బంజారాహిల్స్ బాధితుడి నుంచి మిగతా డబ్బు బదిలీ అయినట్టు చెప్పారు. మోసగాళ్లు వాట్సాప్ ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ట్రేడింగ్ టిప్స్ ఇచ్చి ముందు డబ్బు వచ్చేలా చేస్తారని, తర్వాత తాము అనుకున్న మొత్తాన్ని కొట్టేసి ఫోన్లు స్విచాఫ్ చేస్తారన్నారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శిఖా గోయల్ సూచించారు.



అయ్యప్పస్వామి పల్లకిని మోస్తున్న ఎమ్మెల్యే పాయలశంకర్

ఘనంగా ఆరట్టు

అయ్యప్ప మహా పడిపూజ

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హరిహ రసుతుడు, మణికంఠుడు అయ్యప్ప స్వామికి ఆదివారం ఆదిలా బాద్ జిల్లా కేంద్రంలో ఘనంగా ఆరట్టు నిర్వహించారు. తెల్లవా రుజామున శ్రీరామచంద్ర గోపాల కృష్ణ మఠం వద్ద నుంచి చేపట్టిన ఈ ఆరట్టు ఉత్సవాన్ని మఠా ధిపతి యోగానంద సరస్వతి ముఖ్యఅతిథిగా హాజరై స్వామి నగర సంకీర్తనను ప్రారంభించారు. ఆరట్టు ఉత్సవానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ హాజరై స్వామి పల్లకి సేవలో పాల్గొని అయ్యప్ప పాటలు ఆలపించి నృత్యాలు చేశారు. అటు రవీంద్రనగర్‌లోని ఉమామహేశ్వరం అయ్యప్ప ఆలయం నుంచి చేపట్టిన అయ్యప్ప ఆరట్టు శోభాయాత్ర వైభవోపేతంగా కొనసాగింది. శోభాయాత్ర శాంతినగర్‌లోని సాయిబాబా మందిరం వరకు చేరుకోగా మాజీ మంత్రి జోగురామన్న, ఆయన సతీమణి రమాదేవితో కలిసి పల్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లోకేశ్వరం : మండలంలోని బిలోలిలో అయ్యప్ప స్వామి మహాపడి పూజను ఎంతో కన్నుల పండుగగా నిర్వహిం చారు. కన్నె స్వాములు, కత్తి స్వాములు, గదా స్వాములు, గురు స్వాములు వివిధ మండలాల నుంచి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్, మండల నాయకులు పూజలో పాల్గొని వారి మొక్కులు చెల్లించుకున్నారు. ఈయనతో పాటు రాజేష్ బాబు, ఎం. శ్రీధర్, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

తాంసి : మండల కేంద్రంలో ఈ సంవత్సరం సుమారు 48 మంది అయ్యప్ప స్వాములు స్వామి దీక్షను తీసు కున్నారు. గ్రామానికి చెందిన అన్నెజుల సంతోష్ గురు స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిరంతరంగా సజావుగా కొనసాగుతుంది. మండలంలో సుమారు 300కు పైగా అయ్యప్ప స్వాములు తీసుకున్నారు.

భైంసా: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని నాగ్‌పూర్ ఫ్యాక్టరీ ప్రాంతంలో ఆదివారం మణికంఠ డిజిటల్స్ వారి అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. రాత్రి వేళలో జరిగిన మహా పడిపూజ మహోత్సవానికి డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్ప స్వామి దీక్షదారులు, భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. భైంసా అయ్యప్ప క్షేత్ర ప్రధాన అర్చకులు మంత్రి సాయినాథ్ చేతుల మీదుగా మణికంట డిజిటల్స్ నిర్వాహకులు చిమ్మన్‌వారి బాలాజీ దంపతులు మహా పడిపూజ మహోత్సవాన్ని చేపట్టారు. ఇందులో అయ్యప్ప స్వామి నామస్మరణ, శరణు గోషతో నాగ్‌పూర్ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాలు మార్మోగిపోయాయి. దీక్షదారులు ఆలపించిన గేయాలు, చేపట్టిన నృత్యాలు భక్తులను విశేషంగా అలరారించాయి. నాలుగు గంటల పాటు అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్వాములు పాల్గొన్నారు.



పడిపూజ నిర్వహిస్తున్న చిమ్మన్‌వార్ దంపతులు



హాజరైన ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

సమస్యలకు నిలయాలు.. ఆశ్రమ పాఠశాలలు

(5వ పేజీ తరువాయి...)

బాలికల ఆశ్రమ పాఠశాల, బాలుర ఆశ్రమ పాఠ శాల, నర్సాపూర్(బీ) బాలికల ఆశ్రమ పాఠశాలల్లో లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్లు పని చేయడం లేదంటున్నారు.

తప్పని చన్నీటి స్నానం

చలి కాలంలో వేడినీటితో విద్యార్థులు స్నానం చేయాలని ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్‌లు కొన్నిచోట్ల పని చేయక పోతుండగా.. మరికొన్ని చోట్ల ప్యానెల్స్ మాత్రం బిగించి హీటర్స్ ఏర్పాటు చేయడంలో నిర్వాహకులు విఫలమయ్యారు. నెడ్ క్యాప్‌సంస్థ సహకారంతో సబ్సిడీపై అందించిన 38 వాటర్ హీటర్లలో కేవలం ఒకే చోట పని చేస్తుండగా.. మిగతా 37 పాఠశాలల్లో వాటర్ హీటర్లు పని చేయడం లేదని తెలుస్తుంది. 37 పాఠశాలల్లో వాటర్ హీటర్లు పని చేయడం లేదని తెలుస్తుంది. అదే విధంగా కొన్ని చోట్ల సోలార్ ప్యానల్స్ పెట్టిన హీటర్లను మరిచి పోయారని.. ఫలితంగా విద్యార్థులకు చల్లని నీటి స్నానాలు తప్పడం లేదు. ఇదేకాకుండా ట్రంకు బాక్సులు, బ్లాంకెట్లు రెండేళ్లకోసారి సరఫరా చేయాల్సి ఉన్న సరఫరా కావడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనరా ఉన్నతాధికారులు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తలమడుగు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండలస్థాయి వ్యాస రచన పోటీలు పునరు త్పాదక ఇంధన వనరులు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటు బహుమతులను ఎంపీడీవో చంద్రశేఖర్ ఎంఈవో వెంకట్‌రావులు అందజే శారు. ఈ పోటీలో టీ సహస్ర ప్రథమ, సాని యా ఖన్నం, ద్వితీయ, బి.శృతి తృతీయ స్థానం గెలుపొందడం జరిగింది. వారికి పత్రాలు, బహుమతులు ఎంపీడీవో శేఖర్ ప్రధానం చేశా రు. కార్యక్రమంలో ఎంఈవో జి.వెంకట్‌రావు, ఎంఆర్‌సీ సిబ్బంది ప్రకాష్, కృష్ణ పాల్గొన్నారు.

చిరుత దాడిలో ఆవు మృతి



చిరుత దాడిలో మృతి చెందిన ఆవు

బజార్‌హత్నూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామమైనా బుర్కపల్లి అటవీప్రాంత శివారులో చిరుతపులి దాడి చేసి ఆవును చంపింది. ఈ ఘటన బజా ర్‌హత్నూర్ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే ఎఫ్ఆర్వో పుండలిక్ తెలిపిన వివరాల ప్రకారం బుర్కపల్లి గ్రామా నికి చెందిన రవి అనే రైతుకు చెందిన ఆవు పశుగ్రాసం కోసం సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లిందని శనివారం రాత్రి సమయం వరకు తిరిగి రాకపోవడంతో ఆదివారం రైతు అటవీ ప్రాంతం సమీపంలో ఆవుకోసం గాలిస్తూండగ చిరుతదాడి చేసి అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి చంపినట్లు ఆయన తెలిపారు. ఆవు కోసం రైతువెతకడంతో అటవీ ప్రాంతంలో చిరుత దాడి చేసినట్లు ఆనవాళ్లు కనిపించడంతో ఫారెస్టు అధికారులకు సమాచారం అందిం చారు. దీంతో గ్రామంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్టు అధికారులు సూచించారు. ఆవు విలువ రూ.30 వేలకు పైగా విలువ ఉం టుందని రైతు పేర్కొన్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఉట్నూర్‌లో బీజేపీ నిరసన దీక్ష



నిరసన దీక్షలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రాథోడ్

ఉట్నూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని భారతీయ జనతా పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ రితేష్‌రాథోడ్ ఆరోపించారు. ఆదివారం ఉట్నూర్ మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు ఉట్నూర్ ఇంద్రవెల్లి మండలాల నాయకులతో కలిసి రైతు నిరసన దీక్ష నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విఫలం అవుతున్నార న్నారు. ఆరుగ్యారంటీల పథకాలు ఇంకా కొలిక్కి రాలేదన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణం పథకాన్ని మహిళలు విసుక్కుంటున్నారన్నారు. రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేయడంలో విఫలం అయ్యారని, అదే మాదిరి రైతుబంధు పథకం అందరికి అమలు చేయడం లేదని, పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం సైతం ఇవ్వలేక పోయారని విమర్శించారు. దివ్యాంగులకు అధికారంలోకి రాగానే 4000 పింఛన్ ఇస్తామని ప్రకటించి అమలు చేయలేదన్నారు. రేషన్‌షాపుల్లో రాష్ట్ర ప్రభుత్వం బియ్యం ఇవ్వడం లేదని గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పథకమే అమలు అవుతుందన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలను చైతన్యపరిచి వారికి వ్యాధి పట్ల పూర్తి అవగాహన కల్పిస్తేనే ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించొచ్చని డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్బంగా ఆదిలాబాద్ డీఎంహెచ్ఓ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు మెమెంటోలను అందించారు. కార్యక్రమంలో డీఐఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జ్ఞానం పెంచుకోవాలి : పిరమిడ్ మాస్టర్

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యోగులు, మహాపురుషులు ఇచ్చిన జ్ఞానంతో జీవితంలో ముందుకు సాగాలని పిరమిడ్ స్పిరిచ్చువల్ సొసైటీ మూవ్‌మెంట్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఉమామహేశ్ అన్నారు. ఆదివారం గోపాలకృష్ణ మఠంలో సొసైటీ ఆధ్వర్యంలో భిన్నంగా ఆలోచించు అనేక అంశంపై అవగాహన కల్పించారు. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలు, రోజు ఎలా చేయాలనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా పిరమిడ్ స్పిరిచ్చువల్ సొసైటీ మూవ్‌మెంట్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఉమామహేశ్ మాట్లాడుతూ ధ్యానం అంటే శ్వాసమీద ధ్యాస అన్నారు. గురువులు, యోగులు ధ్యానం గురిం చి ఎంతో చెప్పారన్నారు. ఆధ్యాత్మికం అంటే ఆనందంగా అద్భుతంగా జీవించడమని పేర్కొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు

బోథ్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుచలాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్బంగా మద్యం తాగి వాహనాలను నడపవద్దని వాహనదారులకు సూచించారు. పూర్తిస్థాయిలో లైసెన్స్‌లను, పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు.

హిందువులపై దాడులను ఖండిస్తున్నాం

- ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందువులు ఎప్పుడు కూడా అంద రు బాగుండాలని కోరుకుంటారని అన్నారు. ఇస్కాన్ సంస్థ కుల మతాల కతీతంగా పని చేస్తాయని అన్నారు. బంగ్లాదేశ్ ఇస్కాన్ ఆలయాలపై హిందువులపై జరుగు తున్న దాడులను దేశం మొత్తం ఖండిస్తుందన్నారు. హిందువులపై జరుగు తున్న దాడులను ప్రతిఒక్కరు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఈనెల 4న విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్‌లో చేపట్టే నిరసన కార్యక్రమాన్ని హిందువులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మళ్లీ తెరపైకి ఆదర్శ రైతు!

● ఇటీవల వ్యవస్థను పునరుద్ధరిస్తామన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ● ఏఈవోలకు కలగనున్న ఊరట ● ప్రతీ వెయ్యి ఎకరాలకు ఒకరు మాత్రమే..

నేరడిగొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆదర్శ రైతు వ్యవస్థ మళ్లీ తెరపైకి వచ్చింది. ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదర్శరైతు వ్యవస్థను పునరుద్ధరిస్తామని స్పష్టతనిచ్చారు. దీంతో ఏ ప్రాతిపదికన ఆదర్శ రైతులను నియమిస్తారోనన్న ఆశలు రేకెత్తుతున్నాయి. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆదర్శ రైతుల నియామకాలను చేపట్టారు. పొలాల వెంబడి తిరిగి రైతులకు సాగుపై సలహాలు, సూచనలను ఇచ్చేవారు. వ్యవసాయ శాఖకు, అన్నదాతకు అనుసంధానంగా వ్యవహరించేవారు. ఆ తర్వాత ఈ పథకానికి స్వస్థి పలికారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సదరు వ్యవస్థను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతుండడం ఆహ్వానించదగ్గ పరిణామం.

ప్రతీ వెయ్యి ఎకరాలకు ఒకరు

వెయ్యి ఎకరాలకు ఒక ఆదర్శ రైతును నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, ప్రస్తుతం 5వేల ఎకరాలకు ఒక వ్యవసాయ క్లస్టర్ ఉంది. ఇందులో రైతు వేదికను ఏర్పాటు చేసి ఏఈవోలను నియమించారు. ఈ లెక్కన ప్రతీ క్లస్టర్‌కు ఐదుగురు ఆదర్శ రైతులు నియమితులయ్యే అవకాశముంది. జిల్లాలో 101 క్లస్టర్లున్నాయి. ప్రతీ క్లస్టర్లో ఐదుమంది చొప్పున 505మంది ఆదర్శ రైతులు నియమితులు కానున్నారు.

రైతు.. సమాచారం!!



బుగ్గారంలోని రైతు వేదిక

ఏఈఓలకు ఉపశమనం

గతంతో పోలిస్తే ఏఈఓల సంఖ్య పెరిగినా అదనపు పనులు అప్పగిస్తుండడంతో ఒత్తిడి పెరిగింది. అంతేకాకుండా ఇటీవల డిజిటల్ సర్వే చేసేందుకు ససేమిరా అనడమే కాకుండా ఆందోళనలు సైతం చేశారు. రైతు సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించడం, ధాన్యం సేకరణలో సహాయ పడడం, రైతులకు సలహాలు, సూచనలివ్వడం లాంటి పనులతో ఏఈవోలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇప్పుడు ఆదర్శ రైతుల్ని తీసుకుంటే కొంత ఉపశమనం కలుగుతుందని ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఏఈవోలు భావిస్తున్నారు.

గతంలో నియామకాలు ఇలా..

2007లో పదో తరగతి ఉత్తీర్ణులై వ్యవసాయంపై అనుభవమున్న యువ రైతుల్ని గుర్తించి ఆదర్శ రైతులుగా నియమించారు. అప్పట్లో 200 నుంచి 250 ఎకరాలకు ఒక ఆదర్శ రైతును ఏర్పాటు చేశారు. వీరికి 20 రకాల బాధ్యతల్ని ప్రభుత్వం అప్పగించింది. గౌరవ వేతనం కింద నెలకు రూ.వెయ్యి చొప్పున అందజేసింది. ప్రతి ప్రభుత్వ కార్యక్రమం లోనూ వీరిని భాగస్వామ్యం చేసింది. అప్పట్లో మండలాల్లో వ్యవసాయ విస్తరణ అధికారుల కొరత ఉండడంతో రైతులకు వీరి సేవలు బాగా నే ఉపయోగపడ్డాయంటున్నారు. అయితే పలు కారణాలతో ఈ వ్యవస్థను ప్రభుత్వం 2017లో రద్దు చేసింది.



● అమ్మవారి ఆలయంలో నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులు



● కళాకారుల గానామృతం

అమ్మవారి చెంతన నృత్య ప్రదర్శన

బాసర, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం చిన్నారుల కూచిపూడి నృత్యప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. నిర్మల్ పట్టణం స్వరూపిణి కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు వివిధ భక్తిగీతాలు, పౌరాణిక సన్నివేశాలపై చేసిన నృత్యాలు భక్తులను కనువిందు చేశాయి. అలాగే భక్తి పాటలతో గానామృతం వీనుల విందుగా సాగింది. ఈ కార్యక్రమం అనంతరం ఆలయ దీపోత్సవంలో భాగంగా దీపాలను వెలిగించారు.

కలప రవాణాను ఆపేవారేరి?

● అటవీ ప్రాంతంలో చెట్లను నరికి యథేచ్ఛగా సరఫరా ● ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అక్రమ రవాణా

ఇచ్చోడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా.. ఎవరూ లేని సమయంలో చెట్లను నెలమట్టం చేసి రహస్యంగా మరో ప్రాంతానికి తరలిస్తున్నారు. విలువైన కలపను సైజులుగా మార్చి ఎవరికీ అగుపించకుండా జిల్లాలు దాటిస్తారు. పనికి రాని కలపను వంట చెరకుకు ఉపయోగిస్తారు. అడవుల్లో కొట్టి పడేసిన చెట్లను ముక్కలుముక్కలుగా చేసి దూర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముతుంటారు. ఇచ్చోడ మండలంలో పెద్ద అటవీ ప్రాంతమైన సిరిచెల్మ ప్రాంతం నుంచి నిత్యం ఎడ్లబండ్లపై అక్రమంగా కలప రవాణా చేస్తున్నారు. అటవీ ప్రాంతం నుంచి కలప సేకరించి ఒక చోట నిల్వచేసి ఎవరూ చూడని సమయంలో కలప రవాణా సాగుతున్నా.. అటవీ అధికారులు ముందు నుంచి ఎడ్లబండ్లపై వెలుతున్న పట్టించుకోవడం లేదంటున్నారు. అటవీ పరిధిలో నుంచి కలప రవాణా ఎక్కువగా చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. పచ్చటి చెట్లను నరికి వేసి గుట్టుచప్పుడు కాకుండా ఎడ్లబండ్లలో సరఫరా చేస్తున్నారు.

సిరిచెల్మ నుంచి ఇచ్చోడ మండలకేంద్రానికి వచ్చే మార్గంలో మాన్కాపూర్ చౌరస్తా వద్ద చెక్‌పోస్ట్ ఉన్నప్పటికీ.. కలప ఇచ్చోడకు చేరుకుంటుంది. ఇదిలా ఉండగా.. అధికారులు కలప రవాణాను పట్టించుకోక పోవడంపై సర్వత్రా అనుమానులు వ్యక్తం అవుతున్నాయి. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఆటోల్లో, జీపులల్లో సైతం కలపను తరలిస్తున్నా.. చెక్‌పోస్టు ముందు నుంచే మండల కేంద్రానికి చేరుకుంటున్నారే.. తప్ప ఎక్కడా ఎవరూ వారించడం లేదు. ప్రధాన రహదారి ఇచ్చోడ నుంచి సిరిచెల్మ వెళ్లే ప్రాంతంలో బహిరంగంగా కలప రవాణా కొనసాగుతోంది. అయినప్పటికీ అటవీ శాఖ అధికారులు మాకేం సంబంధం లేదనట్టుగా వ్యవహరిస్తుండడం గమనార్హం. ఇదిలా ఉండగా.. అసలు అటవీ అధికారులు విధులు నిర్వహిస్తున్నారా? తమకు కేటాయించిన ప్రాంతాల వైపు వెళ్తున్నారా? అనే సందేహాలు వ్యక్త మవుతున్నాయి. ఇకనైనా కలప అక్రమ రవాణాను అటవీశాఖాధికారులు అడ్డుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జర దేఖో!!





ఎడ్లబండిపై కలపు అక్రమంగా తరలిస్తున్నారిలా..



బీజేపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రామారావ్ పాటిల్

గ్రామాల అభివృద్ధికి కృషి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేగాం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం ఆ పార్టీని వీడి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వీరంతా దేగాం గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు కో-ఆర్డినేటర్ సుష్మారెడ్డి నేతృత్వంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ సమక్షంలో పార్టీలో చేరారు. గ్రామ మాజీ వార్డు సభ్యుడు భోజ రామ్ పాటిల్, గ్రామ వీడీసీ మాజీ కోశాధికారి బెల్లాం పోతన్న, అల్లం సాయినాథ్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌ను వీడి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పార్టీ కండువా వేసి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాటిల్ మాట్లాడుతూ దేగాం గ్రామం నుంచి శాసన సభకు ఎన్నో దశాబ్దాల కాలం పాటు ప్రాతినిధ్యం వహించిన నేతలున్నప్పటికీ అభివృద్ధికి మాత్రం అమడ దూరంలోనే నిలిచిపోయిందన్నారు. గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. తాను దేగాం గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రగతికి బాటలు వేస్తానని వెల్లడించారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించి అన్ని విధాలుగా అండదండగా నిలుస్తానని తెలిపారు. ఇందులో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి గంగాధర్, ముథోల్ నియోజక వర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లోడ్ శ్రీనివాస్, నియోజక వర్గ ప్రతినిధి సోలంకే భీంరావ్ పాటిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ..

ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొందిన బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించి బాసటగా నిలుస్తామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల వాసులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వైద్య సేవల విషయంలో బాధిత కుటుంబాలు ఆర్థికపరమైన సమస్యల బారిన పడకుండా ఉండేందుకు గాను చేయూతనందిస్తామని వివరించారు. సీఎం రిలీఫ్ ఫండ్ విషయంలో బాధిత కుటుంబాలు పూర్తి వివరాలతో తమ క్యాంప్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇందులో బీజేపీ ప్రతినిధి సోలంకే భీంరావ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆదిలాబా ద్‌లోని తిరుమలనగర్ (బంగారిగూడ)లోని శ్రీఅలివేల మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మో త్సవాలు, జాతరను భక్తులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్య క్రమంలో బ్రహ్మోత్సవాలు వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్క రించారు. ఈనెల 20నుంచి 22వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పిప్రి సమీపంలో టిప్పర్ ఢీకొని గొర్రెల మృత్యువాత

బజార్‌హత్నూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి గ్రామ సమీపంలో బజార్‌హత్నూర్ ఇచ్చోడ వెళ్ళే రహదారి గుండా కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ ఢీకొని 10 గొర్రెలు అక్కడికక్కడే మతి చెందగ రెండు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పిప్రి గ్రామానికి చెందిన కుర్మె రాజమల్లు అనే రైతుకు చెందిన గొర్రెల మంద ఆర్‌అండ్‌బి రోడ్డును దాటుతున్న క్రమంలో వెనుక నుండి కంకర టిప్పర్ వేగంగా రావడంతో అదుపుతప్పి గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో దాదాపు 12గొర్రెలు మృతి చెందాయని వారు తెలిపారు.

ఆశా వర్కర్ల సంఘ కార్యవర్గం ఏర్పాటు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా ఆశావర్కర్ల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా బి.సుజాత, ఉపాధ్యక్షులుగా చంద్రకళ, విజయ, సరిత, ఇంద్రమాల, అనసూయ, సుగుణ, లక్ష్మి ఎన్నికయ్యారు. ప్రధానకార్యదర్శిగా పి. గంగామణి, సహాయ కార్యదర్శులుగా శ్యామల, సులోచన, విజయ, జ్యోతి, మౌనిక ఎన్నిక కాగా కోశాధి కారిగా రామలక్ష్మి ఎన్నికయ్యారు. ఆశావర్కర్లకు 18 వేల రూపా యల వేతనం ఇవ్వాలని, పారితోషకాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

యంగ్ స్టార్ యూత్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఖానాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని యంగ్‌స్టార్ యూత్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. స్థానిక విశ్రాంతి భవనంలో పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన యూత్‌సభ్యులతో నిర్వహించిన సమావేశంలో నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు షేక్‌షకీల్ తెలిపారు. ఈ సం దర్భంగా యూత్ అధ్యక్షుడిగా ఎస్‌కే షకీల్, ఉపాధ్యక్షుడిగా అల్ హజ్, ప్రధానకార్యదర్శిగా అఖిల్, కోశాధికారిగా మాజిద్‌లతో పాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

ఆసుపత్రిని సకాలంలో పూర్తి చేయండి

● ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

బోథ్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న బోథ్ సివిల్ ఆసుపత్రి సకాలంలో పూర్తిచేయాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు సంబంధిత ఇంజ నీరింగ్ అధికారి ప్రశాంత్‌ను కోరారు. ఆదివారం డీఎస్పీ జిల్లా నాయకులు వెంకటేష్ సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో సంప్రదించడం జరిగిందన్నారు. అయితే సకాలంలో బిల్లులు రాకపోవడం వల్ల ఆసుపత్రి నిర్మాణంలో జాప్యం జరుగుతుందని కాంట్రాక్టర్ వివరించారని పేర్కొన్నారు. బోథ్ ఆసుపత్రికి ఆరు పోస్టులు మంజూరు కాగా విధులు నిర్వహించేందుకు డాక్టర్లు రాకపోవడం వల్ల సరైన వైద్యం అందకుండాపోతుందని డీఎస్పీ నాయకులు పేర్కొన్నారు. డాక్టర్లను ఒప్పించి విధుల్లో చేరే విధంగా చూడాలని కోరారు.

సింహగర్జనకు తరలిన నాయకులు

భైంసా, డిసెంబరు 1 : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సింహగర్జనకు భైంసా డివిజన్ పరిధి నుంచి మాలలు భారీసంఖ్యలో తరలివెళ్లారు. ఉదయం భైంసా బస్టాండ్ ఎదుట ఎస్సీ వ్యతిరేక కమిటీ ముథోల్ నియోజక వర్గ అధ్యక్షుడు శంకర్ చంద్రే సింహగర్జనకు తరలే వాహన శ్రేణికి జెండా ఊపి ప్రారంభించారు. కుంటాల, లోకేశ్వరం మండలాల వాహన శ్రేణులు నిర్మల్ మీదుగా భైంసా, కుబీర్, తానూర్, ముథోల్, బాసర మండలాల వాహన శ్రేణులు నిజామాబాద్ మీదుగా హైదరాబాద్‌కు తరలివెళ్లాయి. వాహనాలలో సింహగర్జనకు తరలి వెళ్లినట్లుగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ముథోల్ నియోజక వర్గ అధ్యక్షుడు శంకర్ చంద్రే తెలిపారు.

దిలావర్‌పూర్ : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సింహగర్జన సభకు మాలసామాజిక వర్గం భారీగా తరలివెళ్లింది. మండలంలోని ప్రతి గ్రామం బస్సులను సమకూర్చుకుని సింహగర్జనకు హాజర య్యారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే విరమించుకోవాలని నినాదా లు చేశారు. కాదని వర్గీకరణకు పూనుకుంటే మాలల శక్తి ఏంటో చూపిస్తామని హెచ్చరించారు.

లోకేశ్వరం : హైదరాబాద్‌లో జరుగుతున్న సింహగర్జన సభకు లోకేశ్వరం మండలంలోని అన్ని గ్రామాల నుంచి దాదాపు 1500ల మంది మాలలు బస్సుల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా లోకేశ్వరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి అధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడుతూ... వర్గీకరణ అంశాన్ని వెంటనే నిలిపి వేయాలని దళితులందరూ కలిసి ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించగలమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గౌరవ అధ్యక్షులు దండే రమేష్, ఉపాధ్యక్షులు ఎం. రాజు, గంగాధర్, ఎం. శంకర్, పులి రమేష్, ఎర్రన్న, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

కుంటాల : ముథోల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు మగ్గిడి దిగంబర్, కార్యదర్శి చాకేటి రాజన్నలు బహిరంగ సభకు బయలుదేరుతూ మాట్లాడారు. మందకృష్ణ మాదిగ సోదరులను రెచ్చగొట్టే విధానాన్ని మానుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో వారికి తగిన గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు.

ఖానాపూర్ : ఖానాపూర్ ప్రాంతం నుంచి భారీగా నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ... ఎస్సీలో వర్గీకరణ అవసరం లేదన్నారు. . ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు ధ్యావతి రాజేశ్వర్, నేత శ్యామ్, మ్యాదరి రాజేశ్వర, ఎం. సతీష్, దాసరి రాజన్నతదితరులున్నారు.

తానూర్ : మండలంలోని ఆయా గ్రామాల నుంచి హైదరాబాద్‌కు ఆదివారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేఖ పోరాట సమితి కమిటీ సభ్యులు, మాలలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేఖ పోరాట సమితి మండల నాయకులు అంబాదాస్‌పవార్, తాలూక నాయకులు భీంరావుపవార్, గంగాధర్, లక్ష్మణ్, ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

నేరడిగొండ : మండలం నుంచి వాంకిడి వడూర్, కోర్టికల్, తేజాపూర్, తర్నం,కుప్టి, కుమారి, బుద్దికొండ,స ఆవర్గాం తదితర గ్రామాల నుంచి వందలాది మాలలు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో మండల నాయకులు రాజేశ్వర్ చిప్పరి, విశాల్, నవీన్, లక్ష్మణ్, ఎల్కరాజు, వివిధ గ్రామాల అధ్యక్ష కార్యదర్శులతో పాటు వివిధ గ్రామాల మాలలు తరలివెళ్లారు.

బోథ్: హైదరాబాద్‌లో జరుగుతున్న మాల సంఘం సమావేశానికి మండలం నుంచి భారీ సంఖ్యలో మాల సంఘం సభ్యులు తరలివెళ్లారు. అంతేగాక సోనాల మండల కేంద్రంలో నుంచి సైతం కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు.



భైంసా నుంచి సింహగర్జనకు బయలుదేరిన మాలలు

తలమడుగు: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సుంకిడి, కుచినాపూర్, తలమడుగు, బరంపూర్, దేవాపూర్ కజ్జర్ల తదితర గ్రామాల నుంచి వందలాది మంది మాల సంక్షేమ సంఘం నాయకులు కుటుంబ సభ్యులు బస్సుల ద్వారా బయల్దేరి వెళ్లారు. మాల సింహ గర్జనలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లారు. తమ హక్కులను సాధించే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. అందులో మాల సంక్షేమ సంఘం మండల నాయకులు, ఆయా గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బాసర : బాసర మండల అంబేద్కర్ యువజన సంఘం నాయకులు వర్గీకరణ వ్యతిరేక పోరాటంలో భాగంగా హైదరాబాద్‌లో ఆదివారం తలపెట్టిన సింహ గర్జన కార్యక్రమానికి నాయకులు తరలివెళ్లారు. బాసర మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుండి కార్యక్రమానికి హాజరయ్యారు.


'విద్యా వ్యవస్థ గాడి తప్పింది'

ఉట్నూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురుకుల పాఠశాలల్లో విద్యా వ్యవస్థ గాడి తప్పిందని టీఆర్ఎస్వీ నాయకులు అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనల పై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గేల్లు శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్వీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు దరణి రాజేశ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ నియోజక వర్గంలోని ఉట్నూర్‌లో బీఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి పరీద్ జిల్లా కో-ఆర్డినేటర్ బుట్టిశివకుమార్ దరణి రాజేశ్‌తో కలిసి మైనార్టీ గురుకుల పాఠశాలను విద్యార్థులతో కలిసి సందర్శించారు. తాగునీటి సమస్య కాని స్నానం చేసి నీళ్లతో పిల్లలకు దురద లేచి చర్మ వ్యాధులు సోకడం మరుగుదొడ్లు, స్నానాల గదులకు సైతం తలుపులు లేని పరిస్థితి నెలకొందన్నారు.

వార్షికోత్సవ వాల్‌పోస్టర్ల విడుదల

బోథ్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కైలాస్ టేకిడి ఆలయ 22వ వార్షికోత్సవాన్ని ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ మహారాజ్ సంత లింబాజీ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శివ భక్త మార్కండేయ ఆలయంలో ఆలయ వార్షికోత్సవానికి వాళ్ళ పోస్టర్‌విడుదల చేశారు. గణపతి పూజ 6న, రుద్రాభిషేకం 8న, హోమం, 1008 కలశాలతో కూడిన పూజ ప్రవచనాలుఉంటాయన్నారు. ప్రతిరోజు 8 గంటల నుంచి భజన కార్యక్రమాలు ఉంటాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సిరిపురం చంద్రమోహన్, ఆలయ కోశాధికారి కటకం నగేష్‌తో పాటు పలువురు తదితరులు పాల్గొన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 ; కనిష్ఠం 21.8



విద్యానగర్ కాలనీలో చైర్మన్ పర్యటన

నిర్మల్‌కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం 14వ వార్డు విద్యానగర్ కాలనీలో మున్సిపల్‌చైర్మన్ ఈశ్వర్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఖాళీస్థలాల్లో డ్రైనేజీ, పిచ్చిమొక్కలు పెరగడం, రోడ్డు తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. సత్వర చర్యలకు చైర్మన్ అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్ అబ్దుల్ మతిన్ ఆయన వెంట ఉన్నారు.



బాసర సరస్వతీ అమ్మవారి దేవాలయం (ఇన్‌సెట్‌లో) సరస్వతీ అమ్మవారు

బాసర ఆలయంలో.. అవినీతి మరక!

- అమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాల ఖర్చుల్లో అవకతవకలు
- కీలక అధికారి చేతివాటం
- పనులన్నీ సన్నిహితులకు అప్పగింత
- కూలీల డబ్బుల్లో కోతలు

బాసర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో అక్రమాలు ఆగడం లేదు. అవకతవకలు వెలుగు చూసినా తమ పద్ధతుల్లో మార్పు రావడం లేదు. ఎందెందు వెతికినా అందందు అన్నట్లు ప్రతీ పనిలో చేతివాటం ప్రదర్శిస్తూ అమ్మవారి నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. ఇటీవలే జరిగిన దసరా వేడుకల ఖర్చుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. తక్కువ పనులకు ఎక్కువ మొత్తంలో చెల్లింపులు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సన్నిహితులకే పనులను అప్పగించి ప్రత్యక్షంగా ఎక్కడా చిక్కకుండా అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది.

ఇది అక్రమాల వరుస

ఉత్సవాలు వస్తే భక్తులకేమో గాని బాసర గుడిలో కొందరికి పండుగ వచ్చినట్లే. ఏఏ పనుల్లో ఎంత మిగులుతుందో ముందే లెక్కలేసుకొని ఉంటున్నట్లు స్పష్టమవుతోంది. దసరా వేడుకల్లో చివరి మూడు రోజులు భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. రద్దీకి అనుగుణంగా మూడు రోజుల పాటు వెదురు కర్రలతో క్యూలైన్‌లను ఏర్పాటు చేస్తారు. సుమారు 100 నుంచి 300 మీటర్లు ప్రతీ సంవత్సరం క్యూలైన్లను ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఇటీవల జరిగిన ఉత్సవాల్లో ఈ క్యూలైన్ల ఏర్పాటుకు అధికారులు రూ. ఎనిమిదిన్నర లక్షల ఖర్చు చూయించారు. కానీ ఇది పనుల కంటే చాలా ఎక్కువ అని ఆలయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రతీ సంవత్సరం వసంత పంచమి, దసరా ఉత్సవాలకు గుడిలో క్యూలైన్లను ఏర్పాటు చేస్తారు. ఇలా రెండు సార్లు ఏడాదికి రూ.17లక్షల వరకు క్యూలైన్ల ఖర్చు చూయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తంతో శాశ్వతంగా ఇనుప పైపులతో క్యూలైన్లను ఏర్పాటు చేసుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో ప్రస్తుతం ఉన్న క్యూలైన్ల మరమ్మతుల పేరిట రూ. లక్ష 89 బిల్లులు చెల్లించారు. గేటు ఏర్పాటు చేసినట్లు మరో రూ. 42 వేలు లెక్కల్లో చూయించారు. ఇవన్నీ పనులు ఓ కీలక అధికారి సిద్దిపేట ప్రాంతానికి చెందిన ఓ సన్నిహితుడికి ఈ పనులు అప్పగించి చేతివాటం ప్రదర్శించినట్లు ఆలయంలో స్థానికంగా మాట్లాడుకుంటున్నారు.

కార్మికుల కూలీల్లో కోతలు

దేవస్థానంలో జరిగే ఉత్సవాల్లో అవసరాల కోసం తాత్కాలికంగా రోజువారి వేతనంతో కార్మికులను నియమించుకుంటారు. ఇటీవలే జరిగిన దసరా ఉత్సవాల 9 రోజుల కోసం తాత్కాలిక కార్మికులతో పనులు చేయించుకున్నారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.450 కూలి చెల్లిస్తున్నట్లు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు పొందారు. కాని ఇక్కడ మాత్రం పురుషులు, మహిళలు అని వేరు చేసి ఒక్కొక్కరికి రూ. 150 నుంచి 200 మాత్రమే చెల్లించారు. 90 మంది కార్మికుల కూలీల్లో కోతలు విధించారు. ఎక్కడ ప్రశ్నిస్తే రాబోయే రోజుల్లో జరిగే ఉత్సవాలకు తమకు పిలవరనే భయంతో మౌనం పాటిస్తున్నారు. ఇదిలా ఉండగా పనులకు రాకుండానే కొందరికి కూలీ డబ్బులు చెల్లించారనే ఆరోపణలు ఉన్నాయి.

పనులన్నీ అధికారి సన్నిహితులకే..

దేవస్థాన పనులన్నీ ఓ అధికారి తన సన్నిహితులకు అంటగడుతున్నారనే చాలా కాలం నుంచి ఆరోపణలు ఉన్నాయి. గతంలో పని చేసిన దేవస్థానంలో చేసిన వారికి ఇక్కడికి పిలిపించి పనులు అప్పగిస్తున్నారు. ఎక్కడా చిక్కకుండా వారితో లోపాయికారి ఒప్పందాలతో బాసర గుడిలో అక్రమాలకు పాల్పడుతున్నారనే చర్చ స్థానికంగా ఉంది. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు సైతం సదరు అధికారిపై స్థానికులు ఫిర్యాదు చేశారు. దసరా వేడుకల పనుల్లో కూడా సదరు అధికారి అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిద్దిపేట ప్రాంతం వారికి పనులు అప్పగించడంపై సదరు అధికారిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మరికొన్ని..

- దేవస్థానంలో దసరా వేడుకల్లో పెయింటింగ్ కోసం రూ.5లక్షలకు పైగా ఖర్చులు చూయించారు.
- విద్యుత్ దీపాల అలంకరణ కోసం రూ. 14 లక్షల ఖర్చు చూయించారు. వినియోగంలేని భవనాలకు కూడా విద్యుత్ దీపాలను అలంకరించడంలో ఖర్చులు పెరిగాయి.
- రుత్వికులు ఐదుగురు, పబ్లిక్ అనోసర్ ఇద్దరు, పరిచారక ఇద్దరు, అసిస్టెంట్ కుక్ ఒక్కరు, భజంత్రీలు ఇద్దరిని ఉత్సవాల్లో నియమించుకున్నట్లు చూపి ఖర్చులు చూయించారు. వీరిలో ఎంత మంది పని చేశారో అధికారులకే తెలియాలి.
- వీఐపీలకు ఖర్చులు పెట్టినట్లు లెక్కల్లో చూయించారు.

ఎలాంటి అక్రమాలు జరగలేవు

- విజయ రామారావు, బాసర ఆలయ ఈవో.

దసరా వేడుకల ఖర్చుల్లో ఎలాంటి అక్రమాలు జరగలేవు. పనులు చేయడానికి స్థానికులు ముందుకు రావడం లేదు. అందుకే ఇతర ప్రాంతాల వారికి పనులను కేటాయిస్తున్నాం. కూలి డబ్బుల విషయం తెలియదు. సంబంధిత విభాగ సిబ్బందికే అడగండి.



వినియోగంలో లేని టీటీడీ భవనానికి విద్యుత్ దీపాలను అలంకరించిన దృశ్యం





దసరా నవరాత్రి ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక కర్ర క్యూలైన్లు



ఉత్సవాల్లో అన్నదాన విభాగంలో పని చేస్తున్న తాత్కాలిక కార్మికులు

పోలీసు కిష్టయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

భైంసా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుడైన పోలీసు కిష్టయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్ మీదు ఏర్పాటు చేయాలని బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకెట పోశెట్టి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భైంసాలోని ముదిరాజ్ భవన్‌లో జరిగిన పోలీసు కిష్టయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు పోలీసు కిష్టయ్య అని పేర్కొన్నాడు. తెలంగాణ జాతి విముక్తి కోసం పోలీసు కిష్టయ్య తమ ప్రాణాలనే త్యాగం చేసారని తెలిపారు. ఇలాంటి త్యాగధనుని స్మారకార్థం ట్యాంక్‌బండ్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా జయంతి,వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించడం అంటే వారి ఆశయాలను కొనసాగించడమేనని అన్నారు. అమరవీరులను గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగం అందించాలన్నారు. ఇదే క్రమంలో వారికి ఇల్లు నిర్మించి పెన్షన్ కల్పించాలన్నారు. త్యాగాల పునాదుల మీదనే ఏర్పడ్డ తెలంగాణలో అమరుల కుటుంబాలకు తగు రీతిలో ప్రాధాన్యత కల్పించి న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పోలీసు కిష్టయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో భైంసా డివిజన్ ముదిరాజ్ సంఘ ప్రతినిధులు చొప్పరి వెంకటేష్, నర్సింలు, గంగాధర్, లక్ష్మణ్, యోగేష్‌తోపాటు సంఘ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నాయి.

నిర్మల్‌లో విగ్రహ ఏర్పాటుకు హామీ..

నిర్మల్ కల్చరల్ : నిర్మల్‌లో పోలీస్ కిష్టయ్య విగ్రహం ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ హామీ ఇచ్చారు. రాష్ట్ర సాధనలో కిష్టయ్య ప్రాణాలు అర్పించారన్నారు. ముదిరాజ్ సంఘ సభ్యులు ఆదివారం చైర్మన్‌ను కలిశారు.

నర్సాపూర్(జి) : మండల కేంద్రంలో పోలీస్ కిష్టయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై హన్మాండ్లు, ఆర్ఎస్సై పాతర్ల గణేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి, కోంద్ర రమేష్, డైరెక్టర్ అజీమ్, తెలంగాణ ఉద్యమకారులు భోజారెడ్డి, సాగర్, గంగాధర్, సోము, ముదిరాజ్ సంఘ సభ్యులు సాయన్న, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

ముథోల్ : మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో ఆటోయూనియన్ ఆధ్వర్యంలో పోలీస్ కిష్టయ్య వర్ధంతిని జరుపుకున్నారు. నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు ప్రవీణ్, సాయి, బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న నాయకులు, తదితరులున్నారు.

చదువులో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

మామడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చదువులో నిర్మల్ జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రామారావు అన్నారు. ఆదివారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా జడ్పీహెచ్ఎస్ మామడలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలు - విద్యారంగం అనే అంశంపై వ్యాసరచన పోటీలు జడ్పీ హెచ్ఎస్ మామడ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మండలంలోని ఆయా ఉన్నత పాఠశాలల నుంచి సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... పిల్లలు ఆసక్తితో ఇష్టపడి చదవాలని, చదువుల తల్లి కొలువైన నిర్మల్ జిల్లాను విద్యలో అగ్రస్థానంలో ఉంచాలని కోరారు. పదోతరగతి ఫలితాల్లో ఇప్పటికే రాష్ట్రంలో రెండుసార్లు మొదటి స్థానంలో ఉన్నామని, ఇప్పుడు కూడా మొదటి స్థానంలో ఉంచి హ్యాట్రిక్ సాధించాలని విద్యార్థులను కోరారు. మన రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా అన్ని విభాగాల్లో ప్రత్యేక స్థానంలో ఉందని బాసర సరస్వతి దేవస్థానం తెలంగాణలోనే ఇక్కడే ఉందని, ఇంత ప్రత్యేకత కలిగిన నిర్మల్ జిల్లాను మళ్లీ పదో తరగతిలో మరొకసారి అగ్రగామిగా ఉంచి రాష్ట్రంలోనే నిర్మల్‌ను ప్రత్యేకంగా ఉంచాలన్నారు. అందుకు ప్రణాళికబద్ధంగా కష్టపడి చదవాలన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు మెరుగైన భోజనం, నాణ్యమైన విద్యను అందించాలని, ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా మెలగాలని తెలిపారు. మామడ మండల స్థాయి వ్యాస రచన పోటీల్లో మొదటి బహుమతిని జడ్పీహెచ్ఎస్ మామడ విద్యార్థి డి. గిరిచందన్, రెండో బహుమతిని బి. బిందు కేజీబీవీ న్యూ సాంగ్వి పాఠశాల విద్యార్థిని, మూడో బహుమతిని బి. రాధిక కేజీబీవీ విద్యార్థులు సాధించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి లింబాద్రి, మండల విద్యాధికారి వై. వెంకట రమణారెడ్డి, మామడ పాఠశాల ఉపాధ్యాయులు కే. చక్రధార్, ధర్మపురి, పొన్కల్ పాఠశాల ఉపాధ్యాయులు ప్రమోద్ కుమార్, లక్ష్మణ్, కొరిటికల్ పాఠశాల ఉపాధ్యాయులు గిరిధర్, కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయురాలు శ్యామల పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

మద్యం తాగి వాహనాలు నడపరాదు

లోకేశ్వరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్మథ్‌ఎక్స్‌రోడ్డు వద్ద లోకేశ్వరం ఎస్సై జి.అశోక్, వారి సిబ్బంది ఆదివారం స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్వరం ఎస్సై జి.అశోక్ మాట్లాడుతూ... వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటిస్తూ హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని, వాహ నాలకు సంబంధించిన నిజ ధ్రువీకరణపత్రాలు కలిగి ఉండాలన్నారు. ఒకవేళ మద్యం తాగి వాహనాలు నడిపినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

సంక్షిప్త సమాచారం

బెహరాన్‌లో అనారోగ్యంతో సారంగాపూర్ వాసి మృతి

సారంగాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రానికి చెందిన కల్లూరి వెంకటేష్ అనారోగ్యంతో బెహరాన్ దేశంలో మృతిచెందినట్లు లేబర్ యూనియన్ అధ్యక్షులు స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మూడుసంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం వెళ్లి బెహరాన్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారం రోజుల క్రితం వెంకటేష్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ నాలుగు రోజుల క్రితం ఆసుపత్రిలో మృతిచెందినట్లు తెలిపారు. వెంకటేష్ మృతదేహాన్ని తిరిగి స్వగ్రామానికి తిరిగి వచ్చేలా బెహరాన్ దేశ కార్మికులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించనున్నట్లు తెలిపారు.

సంబరాల పేరుతో ప్రజాధనం వృథా : సీపీఎం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవ సంబరాల పేరుతో ప్రజాధనం వృథా చేస్తోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య ఆరోపించారు. ఆదివారం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు నూతన్‌కుమార్ అధ్యక్షతన కమిటీ సమావేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరుహామీల్లో మహిళలకు ఉచిత బస్సుసౌకర్యం మినహా మిగతావి అమలు చేయలేదన్నారు. రెండు లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించలేదని, రెండుశాతం తరుగు, ధాన్యం తరలింపులో అధికారులు ఇబ్బందులు పెటారని విమర్శించారు. నిర్మల్ జిల్లా అభివృద్ధికి నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. నాయకులు గౌతం కృష్ణ, బి.వసుధ, ఫసియుద్దీన్, శంభు, కామాక్షి పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికుడికి స్వాగతం

లోకేశ్వరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని గోదావరి జన్మస్థానం అయిన నాసిక్ నుంచి సైకిల్‌యాత్ర చేపట్టిన యాత్రికుడికి లోకేశ్వరం మండలవాసులు ఘనస్వాగతం పలికారు. వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సైకిల్ యాత్రికుడు మాట్లాడుతూ... మహారాష్ట్రలోని గోదావరి జన్మస్థానం అయిన నాసిక్ త్రయంబకేశ్వర్ నుంచి ఎక్కడెక్కడ ప్రదేశాల్లో గోదావరి నది ప్రవహిస్తుందో ఆ ప్రదేశామంతా పర్యటిస్తూ చివరకు ఎక్కడ ఆగిపోతుందో మరి అటు నుంచి మళ్లీ నాసిక్ త్రయంబకేశ్వర్ చేరుకుంటానన్నారు. కార్యక్ర మంలో శ్రీనివాస్, నగేష్, రవీందర్ చారి, హరీష్, ఉపాధ్యాయులు సంటిన్న, తదితరులు పాల్గొన్నారు.



సైకిల్ యాత్రికుడికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

డబుల్‌బెడ్‌రూమ్‌లకు నిధుల మంజూరు

భైంసా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాతో పాటు ముథోల్ నియోజక వర్గ పరిధిలోని 16 గ్రామాల్లో డబుల్ బెడ్ గృహ సముదాయల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.5.94 కోట్ల నిధులను మంజూరు చేసింది. మహారాష్ట్ర ఎన్నికల ప్రచార పర్వంలో పాల్గొనేందుకు వెళ్లిన క్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గత నెల 15న భైంసాలో పర్యటించారు. ఇందులో భాగంగా ఇక్కడి డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు నిధులు కేటాయించాలని కోరారు. ఇదే సందర్భంలో మంత్రి పొంగులేటి వెంటనున్న ముథోల్ మాజీఎమ్మెల్యే విఠల్ రెడ్డి భైంసాతో పాటు నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ గృహసముదాయల్లో సైతం మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో గత నెల 26న ప్రభుత్వం భైంసాతో ముథోల్ నియోజక వర్గ పరిధిలోని 16 ప్రాంతాల్లోని డబుల్‌బెడ్ రూమ్ గృహ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.5.94 కోట్ల నిధులను మంజూరు చేస్తూ జీవో విడుదల చేశారు. ఆదివారం ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి దేగాం గ్రామంలో డబుల్‌బెడ్‌రూమ్ గృహ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు మంజూరైన నిధుల వివరాలను వెల్లడించారు. పలు చోట్ల చిన్న చిన్న పనులతో పాటు రహదారులు, మురికి కాలువలు, విద్యుత్తు, నీటి వసతికి రూ. 5,94,31,200 మంజూరైనట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కేంద్రమైన భైంసా పట్టణంలో 600 ఇళ్లకు రూ. 3.07 కోట్లు, కిర్గుల్ (బీ) గ్రామానికి రూ.7 లక్షలు , దేగాం గ్రామానికి రూ.27.20 లక్షలు, హం పోలి (కే) గ్రామానికి రూ.18.57 లక్షలు, కామోల్ గ్రామానికి రూ.15.40 లక్షలు, మాటేగాం గ్రామానికి రూ.13.08 లక్షలు, హల్దా గ్రామానికి రూ.37.90 లక్షలు, మాలేగాం గ్రామానికి రూ.40.19 లక్షలు, రాజురా గ్రామానికి రూ.12.75 లక్షలు, సాంగ్వి గ్రామానికి రూ.14 లక్షలు, సౌంవ్లీ గ్రామానికి రూ.14.40 లక్షలు, వర్ని గ్రామానికి రూ.13 లక్షలు, లింబా (బీ)గ్రామానికి రూ.13 లక్షలు, పెంచికల్‌పాడ్ గ్రామానికి రూ.15 లక్షలు, సాత్‌గాం గ్రామానికి రూ.12.46 లక్షలు, ముథోల్ గ్రామానికి రూ.16.20 లక్షలు, వడ్తాల్ గ్రామానికి రూ.13.40 లక్షలు మంజూరైనట్లుగా వివరించారు. త్వరలో టెండర్లు నిర్వహించి సంబంధిత మౌలికవసతుల కల్పన పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. హామీని నెరవేర్చిన మంత్రి పొంగులేటికి, ఇందుకు సహకరించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్‌లు కృతజ్ఞతలు తెలిపారు.



డబుల్ బెడ్‌రూమ్ సముదాయం

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తానూర్ , డిసెంబరు(ఆంధ్రజ్యోతి) 1 : మండలంలోని ఎల్వీ పాఠశాలలో విద్యార్థులు ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు ఎంఈవో నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను పెంచేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందని, ఈ పోటీలతో వారిలో ప్రతి విషయంపై అవగాహన పెంపొందించుకునేందుకు దోహదపడుతుందన్నారు. ఈ మండల స్థాయి వ్యాసరచనల పోటీలకు మండలంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరు కాగా ఝరి(బీ) పాఠశాల విద్యార్థి జే.విశాఖ మొదటిస్థానం, ఎల్వీ పాఠశాల నుంచి విద్యార్థులు ఎల్.లక్ష్మీకాంత్ రెండోస్థానం, బి.ప్రణీత్ మూడోస్థానంలో నిలిచారు. వీరికి ఎంఈవో బహుతులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో